# ఏక్ దం న్యూస్
సమగ్ర తెలుగు దినపత్రిక

శుక్రవారం, 10 జనవరి, 2025 వరంగల్ సంపుటి : 02 సంచిక : 240



## సంస్కృతీ, సాంప్రదాయలకు ప్రతీక ముగ్గులు

- **కార్పొరేటర్ మరుపల్ల రవి**

**ఏక్‌దం న్యూస్, వరంగల్**

మన ఆచారాలు, సంస్కృతీ సాంప్రదాయాలను ముగ్గులు ప్రతీకగా నిలుస్తున్నాయని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి అన్నారు. గురువారం స్థానిక ముకుంద కాలనీలో కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు భూక్య వినయ్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి కార్పొరేటర్ మరుపల్ల రవి ముఖ్యఅతిథిగా హాజరై ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీలో వివిధ రంగులతో విభిన్నమైన సంక్రాంతి ముగ్గులు వేయడంతో కాలనీలో పండుగ వాతావరణం ఏర్పడిందన్నారు. ముగ్గుల పోటీల్లో ప్రథమ బహుమతి ఎం సాహితీ, ద్వితీయ బహుమతి జీ లావణ్య, తృతీయ బహుమతి ఏ స్రవంతి, కన్సోలేషన్ ప్రైజ్‌లు కే రాధిక, సోని కా దేవి, ఎం రజిత, ఏ మౌనిక, పీ స్వప్నలు సాధించగా.. వారికి కార్పొరేటర్ బహుమతులు ప్రదానం చేశారు. ముగ్గుల పోటీలలో న్యాయ నిర్ణేత లుగా కరుణ, పావనీ టీచర్‌లు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రధాన కార్యదర్శి ఉల్లి కవిత, శానిటరీ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, ఆర్పీ హనుమకొండ హిమబిందు, కరుణ, పావని, మరుపళ్ల గౌతం, శ్రవణ్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలి

- **వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద**

**ఏక్‌దం న్యూస్, వరంగల్**

రోడ్డు ప్రమాదాల నివారణ కోసం రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని రోడ్డు భద్రతా మాసోత్సవాల కమిటీ చైర్మన్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు.జిల్లా కలెక్టరేట్లో గురువారం రోడ్డు భద్రత మహోత్సవాల కమిటీ మీటింగ్ జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జనవరి 1 నుండి 31 వరకు రోడ్డు భద్రతా మాస ఉత్సవాల అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని, అందుకు జిల్లాలో జనవరి 31 వరకు నిర్వహించే రోడ్డు భద్రత మాస ఉత్సవాల ఏర్పాటుకు రోడ్డు అండ్ బిల్డింగ్స్ అధికారి నిర్దేశించిన ఆయా శాఖల అధికారులు వారు చేయవలసిన విధివిధానాలను రూపొందించిన యాక్షన్ ప్లాన్ తయారు చేసి కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.




రోడ్డు ప్రమాదాలు మరియు మరణాలలో 75% నుండి 80% డ్రైవర్ల తప్పిదాల వల్ల సంభవిస్తాయని పేర్కొన్నారు. అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం మరియు డ్రైవింగ్ చేస్తున్నప్పుడు మొబైల్ ఫోన్ ఉపయోగించడం వలన ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని వాటిని నియంత్రించడం వలన ప్రమాదాలను అరికట్టవచ్చన్నారు.

ఈ కార్యక్రమంలో డిసిపి రవీందర్, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ జైపాల్ రెడ్డి, డిఆర్ఓ విజయలక్ష్మి, ఆర్ అండ్ బి ఈఈ జితేందర్ రెడ్డి, సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## కొత్త ఎస్ హెచ్ జీ ల ఏర్పాటు పై ఫోకస్ పెట్టండి

- **రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎం. దాన కిషోర్**

ఎల్ఆర్ఎస్ (అనుమతి లేని లేఅవుట్ల క్రమబద్ధీకరణ పథకం) దరఖాస్తు పరిష్కారం, కొత్తగా స్వయం సహాయక సంఘాల ఏర్పాటు పై ప్రత్యేక దృష్టి పెట్టాలని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎం దాన కిషోర్ మున్సిపల్ కమిషనర్ లను ఆదేశించారు.గురువారం మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో రాష్ట్రంలోని 142 పురపాలక సంఘాల కమిషనర్ లతో రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎం దాన కిషోర్ సమావేశం నిర్వహించి ఎల్ఆర్ఎస్ , రెవెన్యూ , రెవెన్యూయేతర పన్ను వసూలు లక్ష్యం, ఇప్పటి వరకూ సాధించిన లక్ష్యం, ఇంకా చేయాల్సిన పన్ను వసూళు ్ల, భువన సర్వే, మెప్మా కార్యకలాపాల ప్రగతి, తదితర అంశాలపై సమీక్షించారు.

ఈ సందర్భంగా రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎం దాన కిషోర్ మాట్లాడుతూ..ఎల్ఆర్ఎస్ దరఖాస్తు పరిష్కారం వేగవంతం చేసేందుకు క్లియర్ పట్టా భూములు ఉండి, అనుమతులు లేని లే అవుట్ లను వేగంగా క్రమబద్ధీకరణ చేసేందుకు మొదట ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఎలాంటి తప్పిదాలకు ఆస్కారం లేకుండా ఎల్ఆర్ఎస్ ప్రక్రియను పారదర్శకంగా, మార్చి నెల చివరికల్లా ఈ ప్రక్రియ పూర్తిచేయాలన్నారు. దరఖాస్తు దారులు భవన నిర్మాణ అనుమతులు తీసుకునేలా ప్రోత్సహించాలి.

అర్హమైన ప్రతి మహిళ ను స్వయం సహాయక సంఘంలో చేర్పించాలని ప్రభుత్వం ఏజెండా గా పెట్టుకుందన్నారు.మెప్మా పరిధిలోని స్వయం సహాయక సంఘాలకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 3000 కోట్ల రూపాయలను బ్యాంక్ లింకేజి కింద ఇవ్వాలని లక్ష్యంగా నిర్దేశించుకుంటే , ఇప్పటి వరకూ 2500 కోట్ల రూపాయలను సంఘాలకు అందించడం జరిగిందన్నారు. ఫలితంగా ప్రభుత్వం బ్యాంక్ లింకేజ్ లక్ష్యం ను 5000 కోట్లకు పెంచిందన్నారు. మిగతా 2500 కోట్లను సంఘాలకు అందించేందుకు మున్సిపల్ అధికారులు కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు.

పురపాలిక పరిధిలో అర్హత ఉండి సంఘంలో సభ్యులు లేని ప్రతి మహిళను కొత్తగా సంఘాలను ఏర్పాటు చేసి సభ్యులుగా చేర్పించాలని చెప్పారు.

వచ్చే మార్చిలోగా 50 శాతం మందిని, జూన్ లోగా మిగతా 50 శాతం మందిని మొత్తం 100 శాతం మహిళలను 6 నెలల్లోగా సభ్యులుగా చేర్పించాలని చెప్పారు. సంఘ మహిళల్లో ఎంటర్ ప్రెన్యూర్ షిప్ స్కిల్ లను పెంపొందించాలన్నారు.

మహిళా స్వయం సహాయక సంఘాల(ఎస్ హెచ్ జీ) ద్వారా ఏర్పాటు చేసే సౌర విద్యుత్తు ప్లాంట్ల టెండర్లను త్వరలో ప్రభుత్వం ఖరారు చేయనున్న నేపథ్యంలో మెప్మా స్వయం సహాయక సంఘాల ద్వారా పట్టణాల పరిధిలోని ఖాళీ స్థలాలు, రిజర్వాయర్ లు, వాటర్ ట్యాంక్ లపై సౌర విద్యుత్తు ప్లాంట్ల ఏర్పాట్లకు ప్రతి పాదనలు సిద్ధం చేయాలన్నారు.

రాష్ట్ర జనాభాలో 50 శాతానికి పైగా పట్టణ జనాభా ఉందన్నారు. త్వరలోనే దేశంలోనే అత్యధిక అర్బన్ ఏరియా ఉన్న మొదటి రాష్ట్రంగా తెలంగాణ అవతరించనుందన్నారు. రాష్ట్ర జీ ఎస్ డి పి కి 70 శాతం ఆదాయం అర్బన్ ఏరియా నుంచే వస్తుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నేతృత్వంలో ఉన్న పురపాలక శాఖ కు క్షేత్ర స్థాయిలో మంచి పేరు తెచ్చేలా అధికారులు కృషి చేయాలన్నారు.

క్షేత్ర స్థాయిలో శాఖను మరింత పటిష్టం చేసేందుకు ప్రభుత్వం వచ్చే 6 నెలల్లో 48 మున్సిపల్ కమిషనర్ లు, 300 టౌన్ ప్లానింగ్ అధికారులను నియమించనుందన్నారు. భువన సర్వే ను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.ఆస్తి పన్ను, ట్రేడ్ లైసెన్సు, నీటి పన్ను వసూలు ఆశించిన మేర లేదన్నారు. క్షేత్ర స్థాయిలో విస్తృత ప్రచారం తో పాటు

ఎల్ఆర్ఎస్ , రెవెన్యూ మేళాలు, ప్రత్యేక డ్రైవ్ లు నిర్వహిస్తూ మార్చి నెలాఖరులోగా వందశాతం లక్ష్యాలను సాధించాలన్నారు. పురపాలక శాఖ కమిషనర్ డాక్టర్ టి కే శ్రీదేవి మాట్లాడుతూ%.

%పురపాలిక పన్నుల వసూళ్ల కు కమిషనర్ లు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం ముఖ్య కార్యదర్శి, కమిషనర్ పురపాలక శాఖ వాల్ క్యాలెండర్, డైరీని ఆవిష్కరించారు. సమావేశంలో టౌన్ ప్లానింగ్ డైరెక్టర్ దేవేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ముగిసిన ట్రస్మా రాష్ట్ర కార్యవర్గ ప్రమాణ స్వీకారం

- ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- రాష్ట్ర కమిటీలో వరంగల్‌కు పెద్ద పీట
- రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ జనరల్ సెక్రటరీగా 'బిర్లా ఒపెన్ మైండ్స్' వెంకటేశ్వరరావు
- రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్‌గా 'వందన' శ్యామ్(సాంబమూర్తి)
- రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా 'న్యూ కౌటిల్యాస్' కోడం శ్రీధర్
- రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్‌గా 'లిటిల్ బర్డ్స్' జ్ఞానేశ్వర్ సింగ్
- రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా 'బాలజ్యోతి' చక్రపాణి
- రాష్ట్ర కమిటీ సభ్యులుగా మరో ఏడుగురికి అవకాశం



రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ జనరల్ సెక్రటరీ వెంకటేశ్వరరావు



రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ ఆడెపు శ్యామ్ (సాంబమూర్తి)



రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కోడం శ్రీధర్

**ఏక్‌దం న్యూస్, వరంగల్**

ట్రస్మా రాష్ట్ర కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్ నియోజక వర్గం మేకల వెంకటేశం గార్డెన్లో బుధవారం ఘనంగా ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హాజరై మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ప్రైవేట్ బడ్జెట్ పాఠశాలల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

ఈ రాష్ట్ర కార్యవర్గములో వరంగల్ జిల్లా నుంచి వడుప్సా(తెలంగాణ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్) రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ జనరల్ సెక్రటరీగా ఎన్ వెంకటేశ్వరరావు (బిర్లా ఓపెన్ మైండ్స్ స్కూల్), రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ఆడెపు శ్యామ్ (సాంబమూర్తి ) (వందన హై స్కూల్), రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కోడం శ్రీధర్ ( న్యూకౌటిల్యాస్ ఎస్ఏ హై స్కూల్), రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్‌గా టీ జ్ఞానేశ్వర్ సింగ్ (లిటిల్ బడ్స్ హై స్కూల్ ), రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా పీ. చక్రపాణి (బాలజ్యోతి హై స్కూల్) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

అలాగే రాష్ట్ర కమిటీ మెంబర్స్‌గా వరంగల్ జిల్లా ప్రెసిడెంట్ ఏ వీరస్వామి (ఏవీఎస్ స్కూల్), జనరల్ సెక్రెటరీ బిల్లా రవి (సాహితి స్కూల్), ఏ సతీష్ కుమార్ (భారతీయ విద్యా మందిర్), ఏ వెంకటేశ్వర్లు (నాగార్జున హై స్కూల్ ), సంగ వెంకట్రాజం (స్కాలర్స్ హై స్కూల్ ), ఎన్ కిరణ్ కుమార్ (విజ్ఞాన్ నేషనల్ హై స్కూల్), ఎం రాజు (రిషి హై స్కూల్) ఎన్నికయ్యారు.



రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ టీ జ్ఞానేశ్వర్ సింగ్



రాష్ట్ర జాయింట్ సెక్రటరీ పీ చక్రపాణి

రాష్ట్ర కార్యవర్గంలో అవకాశం కల్పించిన ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు శివరాత్రి యాదగిరి, జనరల్ సెక్రెటరీ ఎన్. రమణా రావు, కోశాధికారి జయసింహ గౌడ్, ఎన్ఐఎస్ఏ వైస్ ప్రెసిడెంట్ డా॥ జేఎస్ పరంజ్యోతి, వరంగల్ జిల్లా వడుప్సా కార్యవర్గానికి రాష్ట్ర కమిటీలో ఎన్నికైన వారు కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే జిల్లాలోని, రాష్ట్రంలోని బడ్జెట్ పాఠశాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

ఈ ప్రమాణ స్వీకార మహోత్సవానికి ఖిలా వరంగల్ జోన్ అధ్యక్షులు ముక్కెర రవి, వరంగల్ జోన్ అధ్యక్షులు కూచన క్రాంతి కుమార్, ఎన్ చందర్ బాబు, వడిచెర్ల ప్రసాద్, రమేష్ భాస్కర్, సురేష్, పవన్, శ్రీనుబాబు, వేణుగోపాల్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# పారదర్శకంగా వ్యవహరించాలి

- వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**ఏక్‌దం న్యూస్, వరంగల్**

ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల ఎంపికలో అధికారులు అత్యంత పారదర్శకంగా వ్యవహరించాలని వరంగల్‌జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇందిరమ్మ ఇళ్ల ప్రత్యేక అధికారులు, తహసిల్దార్లతో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇండ్ల విషయంలో అధికారులు ప్రజాపాలనలో స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించి, ఇండ్లు లేని వారిని, అత్యంత నిరుపేదలకు గుర్తించి, వార్డ్, గ్రామ సభలో చర్చించి లబ్ధిదారుల ఎంపిక చేయాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో పెండింగ్‌లో ఉన్న వాటిని, గ్రామాల్లో లేని వారిని పిలిపించి వివరాలు సేకరించి సర్వే పూర్తి చేయాలన్నారు. జిల్లాలోని దూపకుంట, పైడిపల్లి రాయపర్తి, తిమ్మాపూర్ లలోని డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను లబ్ధిదారులకు అందజేయుటకు గాను నియమించిన బృందాలు క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవాలని అన్నారు. మౌలిక వసతుల కల్పనకు అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జిల్లా పరిషత్ సీఈఓ రామిరెడ్డి, తాసిల్దార్లు ఇక్బాల్, నాగేశ్వరరావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.